

# పుస్తక పరిచయం




***Published by:***

***Lipi Publications***
***Gandhi Nagar***
***HYDERABAD – 500 080***
***telugubooks@yahoo.com***
***Phone: 2761 2244***

**మనిషి వ్యక్తిత్వ వికాసం** పలువిధాలుగా ఉంటుంది. తన వృత్తిలో, ప్రవృత్తిలో ఉన్నత శిఖరాలను చేరుకోడానికిగాను వ్యక్తిత్వ వికాసాన్ని వినియోగించుకుని సంఘంలో ఉన్నత స్థాయికి చేరేవారు ఒక రకం. తాము అలవరచుకున్న ఉత్తమ గుణాలవల్ల, తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దికోవడంతోబాటు తమ పరిసరాలని అభివృద్ధిచేసే వారు, తమ చుట్టూ వున్న వారి జీవితాలని వెలిగించే వారు ఇంకోరకం. మొదటి రకం వ్యక్తులు శిఖరాల్లా కనిపిస్తారు. రెండో రకం వ్యక్తులు మైలురాళ్ళలా నిలిచిపోయి దారి చూపిస్తారు. ఔన్నత్యానికి జరిగే ప్రయాణంలో ఎంతదూరం వచ్చామో వారి నుంచీ నేర్చుకోవచ్చు. ఇలాంటి వ్యక్తులూ, వారు చేసిన మంచిపనులూ చదివినప్పుడూ, విన్నప్పుడూ మన మనసుల్లో ఒక విధమైన ఆహ్లాద భావన కలగడమే కాక ఆదర్శభావాల తొలకరి చినుకులు వర్షిస్తాయి. వీరు చేసే పనులు క్లిష్టతరమైనవే కకపోవచ్చు, అతి స్వల్ప సంఘటన వల్లకూడా మనచుట్టూ ఒక ఔన్నత్య వాతావరణాన్ని సృష్టించవచ్చు. అలాంటి అనాకానేక సంఘటనల సమాహారమే ఈ పుస్తకం. ఎక్కడెక్కడినుంచో సేకరించి ‘అనేకమంది మనుషుల దయతో కూడిన నిస్వార్థ చర్యలని‘ ఈ పుస్తకంలో చదవొచ్చు. ముందు మాటలో రచయిత ఈ పుస్తకం వెనుకనున్న ఆశయాన్ని సుస్పష్టంగా చెప్పారు "మంచి చూస్తే అలా చేయాలి అనిపిస్తుంది. అది గురువు. చెడుని చూస్తే అలా చేయకూడదనిపిస్తుంది. అదీ గురువే. ఈ పుస్తకంలోని మనుషుల్లోని వివిధ రకాల మంచితనాలు గురువుగా మనకి మంచి బోధనలు చేస్తాయి. చెడుకి దూరంగా, మంచికి దగ్గరగ ఉంటే మనిషి లౌకికంగా ఉన్నతుడు, ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించేవాడు ఔతాడు. అలాంటి ప్రేరణని ఈ పుస్తకం నుంచి మనం పొందగలమని ఆశిస్తాను‘ అంటారు మల్లాది గారు. ఇదొక గొప్ప ఉదాత్తమైన ప్రయోగం. కేవలం సేకరించిన సంఘటనలేకాక, పుస్తకం చివరలో పెద్ద సాహసాలు, పెట్టుబడులు లేకుండానే ‘మనలోని మనవత్వాన్ని పరిమళింపచేసే అనేక మార్గాలు‘ అంటూ ఎంతో ఆసక్తికరమైన ఆచరణయోగ్యమైన పనుల పట్టికనిచ్చారు. అలానే మనం సహాయం చెయ్యాలనుకుంటే సంప్రదించదగిన ధార్మిక సంస్థల చిరునామాలని కూడా పొందుపరిచారు. ఈ పుస్తకం అందరూ చదవాలి. దాచుకోవాలి. ఎవరికైనా బహుమతిగా కూడా కొని ఇవ్వండి. ఒక మంచి పని మరో మంచిపనికి దారితీసేలా మీవంతు ప్రయత్నం చెయ్యండి. ***




**ఈ రోజుల్లో ఐతే** సినిమా నేపథ్య గీతాల గాయనీ గాయకుల పేర్లు గుర్తుపెట్టుకోలేనన్ని ఉన్నాయి. కానీ పది, పదిహేనేళ్ళ క్రిందటి వరకూ నేపథ్య గాయనీ గాయకులు వేళ్ళమీద లెక్కించదగినంతమందే ఉండేవారు. పైగా తెలుగు సినీ రంగంలో అప్పటివరకూ ప్రసిద్ధులు చాలామంది తెలుగువారే కావడం గమనించదగ్గ విశేషం. పరభాషా గాయనీ గాయకులు ఎక్కువైపోయిన ఈ రోజుల్లో ఎవరు ఎవరో, ఎవరు ఎంతకాలం ఉంటారో ఎవరికీ తెలియడంలేదు. అలనాటి తెలుగు చలన చిత్రస్వర్ణ యుగంలోని గాయనీమణుల గురించిన వివరాలతో రూపొందించిన పుస్తకం ఇది. కేవలం నేపథ్యగాయనులకే పరిమితం కాకుండా అలనాటి సినిమాల్లో నటిస్తూ కూడా పాటలు పాడిన ఎస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, కన్నాంబ లాంటి నటీమణుల గురించిన వివరాలు కూడా ఉన్నాయి. సురభి కమలాబాయి గారి మొదలుకొన్ని ఎస్పీ శైలజ గారి వరకూ దాదాపు 25 మంది తెలుగు సినీ నేపథ్యగాయనీమణుల గురించిన వ్యక్తిగత, సినీ జీవిత వివరాలు ఉన్నా యి ఇందులో. వీలైన చోటల్లా ఆయా గాయనీ మణులు పాడిన పాటల్లో కొన్ని మధురమైన గీతాల్ని వారి గురించిన అధ్యాయాల చివరలో చేర్చారు. ఇదే అంశం మీద వెలువడిన కంపెల్ల రవిచంద్రన్ గారి పుస్తకంతో పోలిస్తే ఈ పుస్తకం చాలా క్లుప్తంగ అనిపిస్తుంది. రచయిత్రి గారు ముందుమాటలో ఆయా గాయనీమణులతో కలిసి చర్చించడానికి పడిన శ్రమ గురించి ప్రస్తావించారు. అలానే వివిధ గాయనీమణుల వ్యక్తిగత జీవితాలలోని చేదు అనుభవాలు వారి కెరీర్ని ఎలా ప్రభావితం చేసిందీ పరోక్షంగా ముందుమాటలో చెప్పారు. అలాంటి వాటిని వ్యాసాల్లో చేర్చలేకపోవడానికి గల పరిమితుల్ని కూడా వివరించారు. కొంతమంది గాయనీమణుల గురించి ఐతే కేవలం 1-2 పేజీల కవరేజ్ మాత్రమే ఉంది(జి.వరలక్ష్మి, టంగుటూరి సూర్యకుమారి వగైరా..). బహుశా గ్రంథ విస్తరణ వగైరా పరిమితులింకేమైనా ఉన్నాయేమో కానీ, కొన్ని వ్యాసాలు అసంపూర్తిగా అనిపిస్తాయి. కథనంలోకూడా కట్టె, కొట్టె, తెచ్చె ధోరణి కనిపిస్తుంది. ఏదేమైనా ఆస్మిత సంస్థ చేసిన ఈ ప్రయోగం మాత్రం అభినందనీయం.

***

***Asmita***
***West Maredpally***
***Secunderabad***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor, KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct, Dublin, CA 94568,USA